

కేఆర్ఆర్ చరిత్రను నిర్మించాలి

ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత కేఆర్ఆర్ కళాశాలదని జూలూరీ గౌరీశంకర్ అన్నారు. - 8లో



ఎయిమ్స్‌లో ప్రికాషనరీ డోస్

బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో కోవిడ్ ప్రికాషనరీ డోస్ వ్యాక్సినేషన్ గురువారం ప్రారంభించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 36°/23°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు స్థాయీ సంఘం సమావేశాలు

భువనగిరిటౌన్ : జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు శుక్ర, శనివారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 1వ (ఆర్థిక ప్రణాళిక), 2వ (గ్రామీణ అభివృద్ధి), 7వ(అభివృద్ధి), మధ్యాహ్నం 4వ(విద్య, వైద్యం) స్థాయీ సంఘం సమావేశాలు ఉంటాయన్నారు. 29వ తేదీ ఉదయం 3వ (వ్యవసాయం), 5వ (మహిళా శిశు సంక్షేమం), మధ్యాహ్నం 6వ (సాంఘిక సంక్షేమం) స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రి కేటీఆర్‌తో గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కలిశారు. ఆలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలు, పార్టీ ప్లీనరీకి సంబంధించిన అంశాలను మంత్రికి వివరించారు. పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకువచ్చేందుకు కష్టపడి పనిచేయాల ని మంత్రి సూచించినట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు.

శ్రీభగీరథ మహర్షికి ఘన నివాళి



శ్రీభగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్ : శ్రీ భగీరథ మహర్షి జయంతిని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అధికారులు మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగేశ్వరాచారి, నర్సింహ, వెంకటేశం, లక్ష్మీపతి పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో కుంభం



దీక్షలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుకు నిరసనగా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీకి లభిస్తున్న ప్రజాదరణను ఓర్వలేక బీజేపీ కక్ష సాధింపునకు పాల్పడుతుందని ఆరోపించారు.

నిరుద్యోగ సభను జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి శుక్రవారం నల్లగొండలో తలపెట్టిన నిరుద్యోగ సభలో నిరుద్యోగులు, యువజనులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. నిరుద్యోగులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నవైఖరికి నిరసనగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నృసింహుడికి పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం నిత్య పూజలు విశేషంగా చేపట్టారు. వేకువజామున సుప్రభాతం ఆరాధన, స్వయంభూలకు నిజా భిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్య కల్యా ణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్ర నామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ!

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- జిల్లాలో రెచ్చిపోతున్న దొంగలు
- వరుస చోరీలతో జనం బెంబేలు
- కేసుల నమోదుతోనే సరిపెడుతున్న పోలీసులు
- సొమ్ము రికవరీలో జాప్యం



కొయ్యలగూడెంలో బుధవారం అర్ధరాత్రి ఓ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు

సాక్షి,యాదాద్రి : తాళం వేసి ఉన్న ఇళ్లే వారి టార్గెట్.. పగలు వీధుల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తారు.. తాళం వేసిన ఇళ్లలో ఎవరూ లేరనే నిర్ధారణకు వచ్చాక రాత్రి దొంగతనాలకు పాల్పడుతారు.. జిల్లాలో కొంతకాలంగా చోటు చేసుకున్న ఘటనల్లో అత్యధికంగా తాళం వేసిన ఇళ్లే కావడం గమనార్హం .. రెండు నెలల వ్యవధిలో 30 వరకు చోరీలు జరిగాయి. వెలుగులోకి రానివి మరెన్నో ఉన్నాయి. ప్రజలు శుభకార్యాల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలపై, నడుచుకుంటూ పగటి సమయంలో వీధుల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గమనిస్తున్నారు.రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్నారు.అంతేకాకుండా వేసవి కాలం కావడంతో జనం ఆరుయట, మేడలపై నిద్రిస్తుంటారు. ఇది గమనించిన దుండగులు ఇళ్లలోకి చొరబడి ఆభరణాలు, నగదు కాజేస్తున్నారు. చోటు చేసుకుంటున్న ఘటనల్లో కొన్ని మాత్రమే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. తక్కువ మొత్తంలో సొమ్ము పోయిన వారు వారు, చోరీ జరిగినా సొమ్ములు పోని వ్యక్తులు పోలీసులను ఆశ్రయించడం లేదు. పోలీసులు నమోదు చేసిన కేసులకు సంబంధించి సొమ్ము రికవరీలో జాప్యం జరుగుతుందని బాధితులు వాపోతున్నారు. గస్తీ పెంచాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణ ప్రాంతాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతున్నాయి.

ఫిబ్రవరి నుంచి జరిగిన చోరీలు.. అపహరణకు గురైన నగదు, బంగారం, వెండి వస్తువులు

- భువనగిరి మండలం గచ్చుబావి వద్ద న్యూస్టార్ బేకర్స్‌అండ్ టీ షాపులో రూ.40వేల నగదు, రూ.5వేల విలువ చేసే ఇతర సామగ్రి.
- కలెక్టరేట్ ఎదురుగా టీ దుకాణంలో రూ.10వేల నగదు, రూ.5వేలు విలువ చేసే వస్తువులు.
- భువనగిరి మండలం అనాజీపురం పరిధిలో శ్రీ దుర్గామాత వెల్డింగ్ షాప్ తాళాలు పగులగొట్టి రూ.30 వేల విలువ చేసే సామగ్రి.
- భువనగిరి పట్టణంలోని రాంనగర్‌లో కానిస్టేబుల్ ఇంట్లో రూ.10 వేలు
- భువనగిరిలోని ఎల్‌బీనగర్‌లో రాగుల రవి ఇంట్లో రూ.5లక్షల విలువ చేసే బంగారు నగలు, నగదు
- హౌజింగ్ బోర్డు, టీచర్స్‌కాలనీ, వెంచర్లలో దొంగతనాలు .

మార్చి నెలలో..

- భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలో ఒంటరిగా ఉన్న చుక్క బుచ్చమ్మ చెవులకు ఉన్న కమ్మలను దుండగులు లాక్కెళ్లారు.
- బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలో నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోనుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి లాక్కెళ్లారు.
- రాజాపేట మండలంలోని వెంకటాపురంలో గుడిసెల పెద్ద భిక్షపతి ఇంట్లో సుమారు రూ.90 వేల నగదు, రెండు తులాల బంగారం.
- నారాయణపురం మండలం చిమిర్యాలలో 15 తులాలు వెండి వస్తువులు రూ.15వేల నగదు.
- మోత్కూర్ మండలం సదర్శాపురంలో దొండ యాదయ్య ఇంట్లో రూ.53 వేల నగదు
- యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో జమ్ము ఆంజనేయులు, జమ్ము శ్రీశైలం ఇంటి ఎదటు పార్కింగ్ చేసి ఉన్న రెండు బైక్‌లు అపహరణ. ఇదే గ్రామంలో కాలే నర్సయ్యకు చెందిన సుమారు రూ.లక్ష విలువ చేసే 20 గొర్రెలను రాత్రి సమయంలో వాహనం తీసుకొచ్చి దొంగలు అపహరించుకెళ్లారు.
- రామాజీపేటలో కనకస్వామి అనే వ్యక్తి ఇంట్లో రెండు సెల్‌ఫోన్లు చోరీ.
- యాదగిరిగుట్ట మండలం బాహుపేట స్టేజీ పరిధిలోని టీ దుకాణంలో రూ.25 వేల నగదు.
- భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి శివారులో సుర్కంటి బాల్‌రెడ్డి పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రూ.40 వేల విలువైన కాపరు వైరు, ఆయిల్.
- పాచిల్లలో కొంపెల్లి సదానందం వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్ ట్రాలీ.

ఏప్రిల్‌లో..

- చౌటుప్పల్‌లోని వలిగొండ రోడ్డులో గల ఓ ఇంట్లో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి, రూ.5వేల నగదు.
- చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం శివారులో తహసీల్దార్ కార్యాలయం వెనుక ఒకే కాంపెక్లెక్స్‌లో ఉన్న రెండు ఇళ్లలో మూడు తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు, రూ.15వేల నగదు.
- చౌటుప్పల్‌లోని 9వ వార్డులో జెడ్పీ హైస్కూల్ ఏరియాలో ఓ ఒంట్లో అరతులం బంగారం, 10తులాల వెండి, రూ.15వేల నగదు.
- చౌటుప్పల్‌లోని శివాజీనగర్‌లో అరతులం బంగారం, పది తులాల వెండి, కొంత నగదు.
- చౌటుప్పల్‌లోని భాస్కర్ థియేటర్ ఏరియాలో ద్విచక్రవాహనం అపహరణ
- చౌటుప్పల్‌లోని బీసీకాలనీలో దొంగలు తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నించారు. పక్కింటి వ్యక్తులు గమనించి కేకలు వేయడంతో పరారయ్యారు.



దూదివెంకటాపురంలో భిక్షపతి ఇంట్లో వస్తువులను చిందరవందరగా పడేసిన దొంగలు (ఫైల్)

క్రమబద్ధీకరించకపోతే ఆందోళన ఉధృతం



ధర్నా చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- కలెక్టరేట్ ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ధర్నా

భువనగిరిటౌన్ : జూనియర్ పంచాయతీ, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హెచ్చరించారు. గురువారం భువనగిరిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగేళ్ల ప్రొబేషన్ కాలం పూర్తి చేసుకున్నామని, అయినా ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పాలనలో కీలకపాత్ర పోషిస్తున్నామని, గ్రామ పంచాయతీలు ఉత్తమ అవార్డులు సాధించడంలోనూ తమ పాత్ర ఎంతో ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జాప్యం చేయకుండా వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు అరె రాజు, పంచాయతీ కార్యదర్శులు వీసం నరేందర్, శ్రీనివాస్, కవిత, చంద్రయ్య, వెంకటేశం , రసూల్, స్వరూప, పద్మజ పాల్గొన్నారు.

రీడింగ్ రూంను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



పబ్లిక్ రీడింగ్ రూంను ప్రారంభిస్తున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరి : పబ్లిక్ రీడింగ్ రూంను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెంలో గల కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ రీడింగ్ రూంను ప్రారంభించి మాట్లాడారు. యువతతో పాటు పిల్లలు సైతం రీడింగ్ రూంను ఉపయోగించుకునేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న భవనానికి మరమ్మతులు చేసి అందంగా తీర్చిదిద్ది పబ్లిక్ రీడింగ్ రూంగా మార్చడం సంతోషదాయకమన్నారు. జిల్లాలో నిరుపయోగంగా భవనాలు ఉంటే అక్కడ పబ్లిక్ రీడింగ్ రూంలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ప్రయో జకులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం రీడింగ్ రూంలో చిన్నారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కౌన్సిలర్ నల్లమాస సుమవెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, గ్రంథాలయం కార్యదర్శి సుదీర్, గోవింద్ రాయ్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు ‘సబ్ రిజిస్ట్రార్’లో అక్రమాలు!

- నిబంధనలకు విరుద్ధంగా 70 రిజిస్ట్రేషన్లు
- డాక్యుమెంట్లు మాయం



మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మోత్కూరు : పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటు చేసుకున్న అక్రమాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. వారం రోజుల క్రితం 70 డాక్యుమెంట్లకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. జిల్లా రిజిస్ట్రార్ ఇటీవల మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ చేయగా అక్రమాలు వెలుగుచూశాయి. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రియల్టర్ల నుంచి లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

బాధ్యులెవరు?

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఇర్షాద్ రంజాన్‌కు సెలవుపై వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. సదరు జూనియర్ అసిస్టెంట్ మరో జూనియర్ అసిస్టెంట్‌కు అప్పజెప్పాడు. దీంతో అతడు ఒక్క రోజే 70 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో వారి ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ కార్యాలయానికి వచ్చి తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో జూనియర్ అసిస్టెంట్‌ను బాధ్యున్ని చేయాలా లేదా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను చేయాలా.? అని ఆ ఉన్నతాధికారి అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేశారు

మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టారు. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని తేలడంతో చర్యలు తీసుకున్నారు.

–ఇర్షాద్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, మోత్కూరు

‘నిరుద్యోగ’ సభకు సిద్ధం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

- సాయంత్రం 4 గంటలకు ఎంజీయూకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాక
- యూనివర్సిటీ విద్యార్థులతో భేటీ
- మర్రిగూడ బైపాస్ నుంచి పాదయాత్ర
- క్లాక్ టవర్ సెంటర్‌లో బహిరంగ సభ
- హాజరుకానున్న ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు జానారెడ్డి, ఆర్డీఆర్



మహాత్మాగాంధీ యూనివర్సిటీ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై టీపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించతలపెట్టిన నిరుద్యోగ నిరసన సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధ్యాహ్నం 2:30 గంటలకు చౌటుప్పల్‌లో స్వాగత కార్యక్రమం, సభతో మొదలుకొని రాత్రి 7 గంటలకు నల్లగొండలో జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న నిరుద్యోగ నిరసన సభకు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్న నేపథ్యంలో ఆ సభను విజయవంతం చేసేందుకు సన్నాహకంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన ఉద్యమంలో భాగంగా నల్లగొండలో సభ నిర్వహిస్తున్నారు. ఈ సభకు నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరుకానున్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు.

భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు

రేవంత్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున తరలించే బాధ్యతను మండల నేతలకు అప్పగించారు. యూనివర్సిటీ వద్దకు చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల మండలాల పార్టీ కార్యకర్తలు చౌటుప్పల్ మీదుగా చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మునుగోడు, చిట్యాల మండలాలు, భువనగిరి, ఆలేరు నుంచి వచ్చే శ్రేణులు కూడా అక్కడికే వచ్చేలా ఏర్పాట్లు చేశారు. రామన్నపేట, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల నుంచి వచ్చే వారు నార్కట్‌పల్లికి వచ్చి అక్కడి నుంచి రేవంత్‌రెడ్డి ర్యాలీలో పాల్గొంటారు. నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ వద్ద ప్రారంభమయ్యే పాదయాత్ర వద్దకు చండూరు, నాంపల్లి , చందంపేట, మర్రిగూడ మండలాలకు చెందిన వారు చేరుకుంటారు. తుంగతుర్తి, దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల నుంచి వచ్చే నేతలు, కార్యకర్తలంతా మర్రిగూడ బైపాస్‌కే వచ్చి రేవంత్ పాదయాత్రలో పాల్గొంటారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన నేతలు

రేవంత్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు గురువారం పర్యవేక్షించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చెరుకు సుధాకర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశం అయ్యారు. పోటీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు పడిన ఇబ్బందులను రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అలాగే నార్కట్‌పల్లి నుంచి పార్టీ శ్రేణులను తరలించే సమావేశంలో కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు వివిధ మండలాలు, నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులను తరలించే సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా నల్లగొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది.

ఇదీ.. రేవంత్ పర్యటన షెడ్యూల్

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు చౌటుప్పల్‌కు చేరుకోనున్నారు. అక్కడ నేతలు, పార్టీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలుకుతారు. అనంతరం నిర్వహించే సభలో రేవంత్ మాట్లాడనున్నారు. 3 గంటలకు చిట్యాల వద్ద చిట్యాల పట్టణంతో పాటు భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలు స్వాగతం పలకనున్నారు. 3.30 నార్కట్‌పల్లికి చేరుకుంటారు. అక్కడ నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూర్, నకిరేకల్ మండలాలకు చెందిన 2 వేల మంది భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలకనున్నారు. వారిని ఉద్దేశించి మాట్లాడిన అనంతరం 4 గంటలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ గేట్ వద్దకు రేవంత్‌రెడ్డి చేరుకుంటారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారితో పాటు అమరవీరులకు నివాళులర్పించనున్నారు.ఆ తర్వాత విద్యార్థులతో భేటీ కానున్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, బాధితులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి మర్రిగూడ బైపాస్‌కు 5 గంటలకు చేరుకుంటారు. రేవంత్‌తోపాటు ఎంపీలు, ముఖ్యనేతలు, ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చే పార్టీ శ్రేణులతో కలిసి క్లాక్ టవర్‌వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. 7 గంటలకు క్లాక్ టవర్ వద్ద జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం వహించారు

- గూడూరు నారాయణరెడ్డి



జూలూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న గూడూరు

బీబీనగర్ : అకాల వర్షాల సూచనలు ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచకుండా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు నిర్లక్ష్యం వహించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఆరోపించారు. గురువారం బీబీనగర్ మండలంలోని రాఘవాపురం, పల్లెగూడెంలో కిసాన్ మోర్చ నాయకులతో కలిసి ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం తడిసినా ఎమ్మెల్యే అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, పాట్కోళ్ల శ్యామ్‌గౌడ్, మండల అధ్యక్షుడు జంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కృష్ణ, సర్పంచ్ కృష్ణ, రంగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చంద్రయ్య, సతీష్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు, అలీనగర్‌లోని కొనుగోలు కేంద్రాలను గూడూరు నారాయణరెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, గూడూరు సర్వోత్తమరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, మైసగోని వెంకటేశం పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్ : కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆలేరులో విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోవడంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షానికి నష్టపోవల్సి వస్తుందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. కొనుగోళ్లలో జాప్యం వల్ల ఇప్పటికే రైతులు 30 శాతం ధాన్యాన్ని తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారని పేర్కొన్నారు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు. వర్షం వస్తే ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్లు కూడా లేకపోవడంతో రైతులు కిరాయికి తెచ్చుకుంటున్నారని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.40 వేలు పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య, దశరథ, గణేష్, దీపిక, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



తుక్కాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి : రైతులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. భువనగిరి మండలంలో తుక్కాపురం, బొమ్మాయిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కేతావత్ మహేందర్, డైరెక్టర్లు సురేందర్ రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ గోపి కృష్ణ, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిమ్స్‌లో కోవిడ్ ప్రికాషనరీ డోస్



వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో కోవిడ్ ప్రికాషనరీ డోస్ వ్యాక్సినేషన్‌ను గురువారం ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించి మాట్లాడారు. కోవిడ్ కేసులు పెరుగుతున్నందున ముందు జాగ్రత్తగా రెండవ డోస్ తీసుకున్న వారందరికీ ప్రికాషన్ డోస్ అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కోవ్యాక్సిన్, కోవిషీల్డ్ రెండు వ్యాక్సిన్లు మొదటి, రెండవ సారి తీసుకున్నవారు కార్బీ వ్యాక్స్ ప్రికాషనరీ డోస్‌కు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో కోవిడ్ వ్యాక్సినేషన్ అసోసియేట్ వైద్యులు గోవిందు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

తిర్మలాపూర్ వాసికి డాక్టరేట్

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన తెల్జిరి గిరీశం (సతీష్‌యాదవ్)కు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగులో డాక్టరేట్ ప్రకటించింది. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎస్.ఆర్ వెంకటేశం పర్యవేక్షణలో తప్పట గుళ్ల, యాదవ సాహిత్యం సమగ్ర పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ను అందుకున్నారు. గిరీశం 2009 ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాల నుంచి ఎంఏ తెలుగు పూర్తి చేశారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రి, ఎమ్మెల్యేలు



సీఎం కేసీఆర్‌కు ఫొటో బహూకరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

నల్లగొండ టూటౌన్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం సీఎం కేసీఆర్‌ను కలిసి ఆయన ఫొటోను బహూకరించారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన వారిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదయ్య, జెడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపిక, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఎన్.భాస్కర్ రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్‌కుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న రత్నాకర్‌రావు

నార్కట్‌పల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టు పనులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నార్కట్‌పల్లి మండలం బి.వెల్లెంల ప్రాజెక్టు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాతాను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, బి. వెల్లెంల ప్రాజెక్టులకు సరిపడా నిధులను కేటాయించకపోవడంతో నేటి వరకు కూడా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు మతోన్మాద విధానాల కారణంగా దేశ లౌకిక వ్యవస్థకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రైతులకు రుణ మాఫీ అని చెప్పి మాయమాటలతో మోసం చేస్తున్నారన్నారు. రైతుల ఆత్మహత్యలు కూడా మరింత పెరిగిపోయాయన్నారు. దళిత బంధు పథకం కూడా అందరికీ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పబ్బు వీరస్వామి, పెండ్యాల శంకర్, ఎండి అక్బర్, జాహింగీర్, షరీఫ్, భిక్షం, లక్ష్మయ్య, చిన వెంకన్న, బాలరాజు, శేఖర్‌రెడ్డి, రమేష్, లెనిన్, వీరయ్య తదితరులున్నారు.

రెండు ఇళ్లలో చోరీ

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెంలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుర్కంటి పద్మ తన ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లి పడుకుంది. అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లారు. అరతులం బంగారు రింగు, 25తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. అదే విధంగా సమీపంలోనే ఉన్న ఎస్‌కె.నాగుల్‌మీర కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. అతని ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన దొంగలు అరతులం గోల్డ్ రింగు, 10వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అనిల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

చండూరు : అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కార్డుదారుల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ విజయ పోలీసులతో కలసి గురువారం దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై 6(ఏ) చట్టం కింద కేసు నమోదు చేసి, బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచినట్లు డీటీ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

సూర్యాపేట రూరల్ : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సాయిరాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 20న, ఈ నెల 10న సూర్యాపేట పట్టణ పరిధిలో 13వ వార్డు గాంధీనగర్ పరిధిలోని అంజనాపురి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బాషానాయక్ తండాలో మూడు ఇండ్లలో చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కందుకూరు మండల మాచవరం గ్రామానికి చెందిన కట్ట మధుబాబు జనగాం క్రాస్‌రోడ్డులో అనుమానస్పదంగా తిరుగుతూ గురువారం పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అంజనాపురి, బాషానాయక్ తండా, వెంకటేశ్వర కాలనిలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రెండు జతల వెండి పట్టీలు, రూ. 2వేలు నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

కోదాడ రూరల్ : కోదాడ పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార ముఠా గుట్టును కోదాడ పోలీసులు రట్టు చేశారు. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అనంతగిరి రోడ్డులో నివాసం ఉంటున్న ఓ వివాహిత ఖమ్మం జిల్లాకు చెందిన మరో మహిళతో కలిసి అమాయక మహిళలను రొంపిలోకి దింపి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అనంతగిరి రోడ్డులో ఉంటున్న మహిళ నివాసంపై దాడి చేయగా బాధిత మహిళతో పాటు ఓ విటుడు పట్టుబడ్డారు. అదే విధంగా పట్టణంలోని కట్టకొమ్ము గూడెం రోడ్డులో ఉంటున్న ఓ వివాహిత మరో మహిళతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందుకున్న సమాచారం మేరకు దాడి చేసి ఓ విటుడు, ఇద్దరు బాధిత మహిళను అదుపులోకి తీసుకున్నారు. కాగా, వారి వద్ద నుంచి కొంత నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విటులను కోర్టులో హాజరుపరిచి బాధిత మహిళలను మహిళా సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రామాంజనేయులు, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మంటలు వ్యాపించి లారీ దగ్ధం

మేళ్లచెరువు : ప్రమాదవ శాత్తు మంటలు వ్యాపించి లారీ దగ్ధమైంది. ఈ ఘటన మండలకేంద్రం పరిధిలోని ఓ లారీ గ్యారేజ్‌లో గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. లారీ గ్యారేజ్‌లో వెల్డింగ్ పనులు చేస్తున్న క్రమంలో లారీ డీజిల్ ట్యాంక్‌కు తగలడంతో ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. దీంతో వెల్డింగ్ పనులు చేస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. మంటలు వ్యాపించడంతో లారీ క్యాబిన్ వరకు పూర్తిగా కాలిపోయింది. గాయాలైన ముగ్గురిని కోదాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ కేంద్రాల్లో నత్తనడకన కొనుగోళ్ల నడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోడంలేదన్నారు. అకాల వర్షాలకు రైతుల వడ్లు తడిసిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ మోతిలాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, చలమల్ల సీతారాం రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు శాస్త్రీయ వ్యాసాలు అవసరం

రామగిరి(నల్లగొండ): ఉన్నత విద్యలో శాస్త్రీయ వ్యాసాలు రాయడం అవసరమని బలానీ ఇన్ఫోటెక్ రిసెర్చ్ మేనేజర్ డాక్టర్ నిఖిత వంజరి అన్నారు. గురువారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల నందు గ్రంథాలయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ ద్వారా ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్, పరిశోధన నైపుణ్యాలపై నేషనల్ వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్ ద్వారా అధికారిక పరిశోధన సమాచారాన్ని వెతికే విధానం, రీసెర్చ్ రైటింగ్, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. వెబినార్ కన్వీనర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి 600 పైగా పరిశోధకులు, లైబ్రేరియన్లు, అధ్యాపకులు, విద్యార్థులు వెబినార్‌లో పాల్గొన్నారన్నారు. ప్రిన్సిపాల్ ఘనశ్యామ్ అధ్యక్షతన జరిగిన ఈ వెబినార్‌లో కో కన్వీనర్ మణెమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ మునీర్, అంతటి శ్రీనివాసులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంపటి శ్రీనివాసులు, సీఓఈ బి.నాగరాజు, అధ్యాపకులు యాదగిరి, దీపిక, యాదగిరిరెడ్డి, నాగేల వేణు, భాగ్యలక్ష్మి, కృష్ణకౌండిన్య, లవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, చంద్రశేఖర్, మల్లేష్, శివరాణి, విష్ణువర్ధన్, ప్రవంతి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆల్ ఇండియా రేడియో కేంద్రాలు ప్రారంభం

• డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి



దేవరకొండలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

నల్లగొండ/దేవరకొండ : దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా 91 ఎఫ్ఎం రేడియో కేంద్రాలను ప్రారంభించనున్నారు. అందులో భాగంగా దేవరకొండ, నల్లగొండలో కూడా ఆల్ ఇండియా రేడియో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ప్రసార భారతి డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం దేవరకొండలో విలేకరులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం నాలుగు ఆల్ ఇండియా రేడియో కేంద్రాలు ప్రారంభిస్తుండగా అందులో భాగంగా రామగుండం, సిర్పూర్, నల్ల గొండ, దేవరకొండలో రేడియో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 100.1ఎంహెచ్‌జెడ్ ఫ్రీక్వెన్సీలో ఈ రేడియో కేంద్రం పని చేస్తుందని, దీనిద్వారా దేవరకొండ పరిధిలోని 20 కి.మీ. మేర ప్రజలకు వార్తా, విజ్ఞాన, వినోద సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడీఈ నర్సింహానాయక్, శ్రీనివాసచారి, హేమచందర్, ఆరోగ్యరెడ్డి ఉన్నారు.

కుటుంబ సంక్షేమ నిధిలో చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్.రాములు

సూర్యాపేటటౌన్ : టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధిలో(ఎఫ్‌డబ్ల్యూఫ్) సంఘం సభ్యులు తప్పకుండా చేరాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో కుటుంబ సంక్షేమ నిధి విధి విధానాలను వివరించేందుకు నిర్వహించిన డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తొలగించిన పాఠ్యాంశాలను చేర్చాలని కోరారు. డీఏ, పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం కోశాధికారి జి.వెంకటయ్య, ఎస్‌కె.సయ్యద్, ఆడం, వెలుగు రమేష్, లాలు, శ్రీనివాసాచారి, ఆనంద్, ఎన్.సైదా, రమేష్, సీనయ్య, బాలాజీ, ఉదయభాస్కర్, జమాలుద్దిన్, ఆంజనేయులు, నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మునీర్‌కు వందేభారత్ భీష్మ అవార్డు



అవార్డు అందుకుంటున్న మునీర్

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన జనమైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఎండి. మునీర్‌కు వందేభారత్ భీష్మ అవార్డు దక్కింది. జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సామాజిక సేవలను గుర్తించిన తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మునీర్‌కు బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్యే శ్రీరాములు చేతుల మీదుగా వందే భారత్ భీష్మ అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా మునీర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ అనిల్ కుమార్

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ కోరారు. ఆలయ అవసరాల నిమిత్తం ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేస్తున్న భూములను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం దుకాణాదారులతో ఆయన మాట్లాడారు. వేసవి కాలం కావడంతో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఆలయ సిబ్బంది సమయపాలన పాటించి భక్తులకు అందుబాటులో ఉండాలన్నారు. అంతకు ముందు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ మహేంద్ర కుమార్, హైదరాబాద్ జోన్ తహసీల్దార్ సునిత, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ మాజీ చైర్మన్ నల్లబోతు యాదగిరి, జూనియర్(ఏసీ కార్యాలయం) అసిస్టెంట్ అఖిల్, ఆలయ సిబ్బంది లింగయ్య, లింగస్వామి, అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చారి, ఉమామహేష్, దామెదర్, నాగరాజు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్యహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి భువనగిరి రైల్వే స్టేషన్‌కు సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి రాత్రి భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే లేవల్ క్రాసింగ్ వద్దకు రాత్రి 8 గంటల సమయానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తగిలి అందులో ఇరుక్కుపోయాడు. డ్రైవర్ గమనించి ముత్తిరెడ్డి గూడెం వెళ్లే రైల్వే గేటు వద్ద రైలును నిలిపివేశాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రైలులో ఇరుక్కున్న మృతదేహాన్ని తొలగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ భువనగిరి ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలి

• అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

ఆలేరురూరల్ : దేశంలో పాలకులు తెస్తున్న సంస్కరణలు, రైతు చట్టాలకు వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాలకు సిద్ధ కావాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ పిలుపునిచ్చారు. ఆలేరులో జరుగుతున్న సంఘం రెండవ మహాసభలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, రైతుబంధు వర్తింపజేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని నష్టపరిహారం అందించాలన్నారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రైతు కూలీలలకు చట్టం తేవాలన్నారు. దళితులు మైనార్టీల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. అనంతరం సభలో పలు తీర్మానాలు చేశామన్నారు. సభలో నాయకులు చిటిబాబు, వెంకటేశ్వర్లుఆడివయ్య, సోమయ్య, నేరేడు స్వామి, వంగాల మధుసూదన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మల్లేషం, సర్పంచ్ సమరసింహారెడ్డి, సహదేవ్, మురళి, మంజుల, ఇక్కిరి శ్రీనివాస్, ప్రవీణ్, సిద్దులు పాల్గొన్నారు.

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

అఖిల భారత రైతు కూలీ సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని 19 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మామిడాల భిక్షపతి, ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ, సత్యం, ప్రధాన కార్యదిర్శి బి.భాస్కర్, సహాయ కార్యదర్శి గొని ఐలయ్య, మోగిలి ప్రతాఫ్‌రెడ్డి, కోశాధికారి దేశెట్టి రామచంద్రం, సభ్యులుగా ఎల్ భీమన్న, గంగారెడ్డి, బుర్కా ఎంకన్న ముత్తారం గిరి, చిలువేరు ఉప్పలయ్య, బానోతుల గంగారావు, గోవర్ధన్, గోపి, రాములును ఎన్నుకున్నారు.

'కేఆర్‌ఆర్' చరిత్రను క్రమబద్ధంగా నిర్మించాలి

• తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్

కోదాడఅర్బన్ : ఆరు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన కోదాడలోని కేఆర్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల చరిత్రను క్రమబద్ధంగా నిర్మించాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ సూచించారు. గురువారం కళాశాలలో మన ఊరు-మన చరిత్ర ప్రాజెక్టుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కళాశాలకు ఎంతో మంది మహనీయులు ప్రిన్సిపాల్స్‌గా, అధ్యాపకులుగా పనిచేశారని పేర్కొన్నారు. ఇక్కడ చదివిన ఎంతో మంది ఉద్యమకారులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, పరిపాలనాదక్షులు, ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎదిగారని గుర్తుచేశారు. చరిత్రను రాయడమే కాకుండా దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. ఆ కళాశాలలో చదివి సామాజిక, సాంస్కృతిక, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ అధ్యాపక, విద్యార్థి, రాజకీయ నాయకుల అంశాలను చరిత్రలో నమోదు చేయాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు మాట్లాడుతూ మన ఊరు-మనచరిత్ర ప్రాజెక్ట్ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. మన ఊరు-మన చరిత్ర సూర్యాపేట జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ నందిగామ నిర్మల కుమారి మాట్లాడుతూ మన ఊరు-మనచరిత్ర అంటే మన మూలాలను మనం వెతుక్కోవడమేనన్నారు. చరిత్రను నమోదు చేయడం భావితరాలకు ఎంతో అవసరమన్నారు. సదస్సులో కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ హరికృష్ణ, అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, సత్యవాణి, శ్రీదేవి, సైదులు, జీఎల్ ఎన్‌రెడ్డి, నర్సింహారాజు, సుమలత, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు జూలూరి గౌరీ శంకర్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సతీష్‌చారి

భూదాన్‌పోచంపల్లి : కుక్కల దాడిలో 14గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకొంది. బాధితులు బందెల వెంకటేశం, పిట్టమోని రాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో గల రంగనాయక గుడి వెనుకాల గ్రామానికి చెందిన కాపరులు గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి రోజు రాత్రి వారు మందవద్ద కాపలాగా పడుకొంటారు. కాగా, గురువారం తెల్లవారుజామున గొర్రెలు అరుస్తున్న శబ్దానికి లేచి చూడగా కుక్కల గుంపు వెంకటేశానికి చెందిన మందపై దాడిచేసి 10 గొర్రెలను చంపేశాయి. అప్రమత్తమైన గొర్రెలకాపరులు వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేయగా సమీపంలో ఉన్న రాములుకు చెందిన మందపై పడి నాలుగు గొర్రెలను చంపేశాయి. అందరూ కలిసి కర్రలతో వెంటపడగా కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయి. ఈ దాడిలో సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని ఉప సర్పంచ్ పడాల సతీష్‌చారి, కాంగ్రెస్‌పార్టీ మండల ప్రధానకార్యదర్శి తోట శ్రీనివాస్, బీరెడి సందీప్‌రెడ్డి, గణేశ్ సందర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.